క్లుప్తంగా

కలెక్టర్‌కు జేఏసీ నాయకుల వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ నాయకులు

ఏలూరు: ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణ నిర్వహిస్తున్నట్టు జేఏసీ చైర్మన్ చోడగిరి శ్రీనివాస్, కన్వీనర్ నెరుసు రామారావులు తెలిపారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జేఏసీ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో జేఏసీ భాగస్వామ్య సంఘాల ప్రతినిధులు రవికుమార్ రుద్రాక్ష, అలీ, పీవీ నర్సింహారావు, పువ్వుల ఆంజనేయులు, రామారావు, గగ్గులోతు కృష్ణ, శ్రీధర్ రాజు, కె.సత్యనారాయణ, ట్రెజరీ గంగాధర్, మాదాసు సాంబ శివరావు, యాసలపు శ్రీను, ఎస్ శివ తదితరులు పాల్గొన్నారు.

నేడు మోటార్ సైకిల్ ర్యాలీ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): 35వ జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా ఈ నెల 15న నగరంలో భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించనున్నట్టు ఉప రవాణా శాఖ కమిషనర్ ఎస్ శాంతకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 8.30 గంటలకు స్థానిక శాంతి నగర్‌లోని పోలీస్ పెట్రోల్ బంక్ నుంచి నగర వీధుల గుండా రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహిస్తామని పేర్కొన్నారు. రవాణా, పోలీస్ శాఖల సిబ్బంది, నగరంలోని ద్విచక్ర వాహన డీలర్లు పాల్గొంటారని తెలిపారు. ర్యాలీలో పాల్గొనే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కోరారు.

ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ఏర్పాటు

ఏలూరు రూరల్ : ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంచుకుని ప్రభుత్వ పథకాల లబ్ధి పొందాలని ఆర్‌బీఐ ఎల్డిఒ పీఎం పూర్ణిమ అన్నారు. బుధవారం ఏలూరులో ఏర్పాటు చేసిన ఆర్థిక అక్షరాస్యత కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా పూర్ణిమ మాట్లాడుతూ ప్రధానమంత్రి జీవన్ జ్యోతి, సురక్ష బీమా, అటల్ పెన్షన్, సుకన్య సమృద్ధి యోజన తదితర కేంద్ర ప్రభుత్వ పథకాలు పొందాలన్నారు. ప్రజల్లో అవగాహన కోసం ప్రతి మండలంలో ఒక కేంద్రం ఏర్పాటుచేస్తామన్నారు. ఏలూరు జిల్లా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ డి.నీలాద్రి మాట్లాడుతూ బ్యాంకింగ్ రంగంలో యాప్స్, క్యూఆర్ కోడ్, నగదు రహిత లావాదేవీలు, రుణాలు, బీమా పథకాలు, డిపాజిట్ తదితర అంశాలపై అవగాహన పెంచుకుని బ్యాంకుల సేవలు పొందాలని కోరారు. కార్యక్రమంలో టి.అనిల్‌కాంత్, ఎస్ శ్రీనివాస్, ఎన్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు అభివృద్ధే వైఎస్సార్ సీపీ లక్ష్యం

- ఎమ్మెల్యే ఆళ్ల నాని
- రూ.2.65 కోట్ల పనులకు శంకుస్థాపన

ఏలూరు టౌన్: ఏలూరు అభివృద్ధే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. ఏలూరు టూటౌన్ ప్రాంతంలోని నాలుగు డివిజన్లల్లో పలు అభివృద్ధి పనులకు నగర మేయర్ షేక్ నూర్జహాన్‌తో కలిసి ఆయన బుధవారం శంకుస్థాపనలు చేశారు. 30వ డివిజన్ మోతేవారితోట ప్రాంతంలో గడపగడపకు మన ప్రభుత్వం నిధులు రూ.80 లక్షలు, నగరపాలక సంస్థ సాధారణ నిధులు రూ.38.04 లక్షలతో 19 సీసీ రోడ్లు, ఆరు సీసీ డ్రెయిన్లు, ఒక అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణానికి, 37వ డివిజన్ కూనపల్లివారివీధిలోని వైఎస్సార్ విగ్రహం వద్ద రూ.20 లక్షల జీజీపీఎం నిధులతో మూడు సీసీ రోడ్లు, ఒక డ్రెయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 38వ డివిజన్ మాగంటివారివీధి కల్యాణి హైట్స్ వద్ద రూ.80 లక్షల నిధులతో తొమ్మిది సీసీ రోడ్లు, తొమ్మిది సీసీ డ్రెయిన్ల నిర్మాణానికి నాని శంకుస్థాపన చేశారు. రూ.60 లక్షలు జీజీపీఎం నిధులు, రూ.20 లక్షలు కార్పొరేషన్ సాధారణ నిధులు ఖర్చు చేసేందుకు నిర్ణయించారు. 39వ డివిజన్ ఈదర సుబ్బమ్మదేవి నగరపాలక పాఠశాల ఆట స్థలం వద్ద రూ.47.02 లక్షలతో నాలుగు సీసీ రోడ్లు, ఐదు సీసీ డ్రెయిన్లు, ఒక తాగునీటి పైపులైన్ ఏర్పాటుకు, ఆర్ఆర్‌పేటలోని ఈదర సుబ్బమ్మదేవి నగరపాలకోన్నత పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.15 లక్షలతో చేపట్టే పనులకు ఎమ్మెల్యే నాని శంకుస్థాపన చేశారు.

పనులు సకాలంలో పూర్తికి ఆదేశం

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ ఏలూరు నగరాన్ని అభివృద్ధి చేయాలనే పట్టుదలతో పనిచేస్తున్నామని, రూ.2.65 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశామని చెప్పారు. త్వరలోనే పనులు ప్రారంభించి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేందుకు అధికారులకు ఆదేశాలిచ్చామన్నారు. ఏలూరు నగరంలో ఇటీవల రూ.40 కోట్లతో ప్రతి డివిజన్‌లోనూ మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టామని తెలిపారు. మేయర్ షేక్ నూర్జహాన్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ఎమ్మెల్యే ఆళ్ల నాని సహకారంతో ప్రజలకు అవసరమైన ప్రతి పనీ చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమాల్లో ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్‌బాబు, పార్టీ జిల్లా కోశాధికారి మంచెం మైబాబు, కార్పొరేటర్లు పప్పు ఉమామహేశ్వరరావు, తోట హేమమాధురి, కిలాడి జ్యోతి, పార్టీ నాయకులు తోలేటి శ్రీనివాస్, తోట సుధీర్, కిలాడి దుర్గారావు తదితరులున్నారు.



ఈదర సుబ్బమ్మదేవి స్కూల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని, చిత్రంలో మేయర్, ఇడా చైర్మన్



30వ డివిజన్‌లో పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాని



39వ డివిజన్‌లో పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాని

బీసీల అభ్యున్నతికి కృషి

ఏలూరు టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీల ఆర్థిక, రాజకీయ, సామాజిక అభ్యున్నతికి విశేష కృషి చేస్తున్నారని ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ బొద్దాని శ్రీనివాస్ అన్నారు. ఏలూరు పవరుపేట వాసుదేవాలయం సమీపంలో బీసీ మేదర కుల సంఘం అధ్యక్షుడు సింహాచలం శ్రీనివాస సత్యనారాయణ, కుల సంఘ పెద్దలు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో బీసీ వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తూ రాజ్యాధికారంలో భాగస్వాములను చేస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్యే ఆళ్ల నాని బీసీ సామాజిక వర్గానికి తమ అండదండలు అందిస్తున్నారని చెప్పారు. సార్వత్రిక ఎన్నికల్లో ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్, ఎమ్మెల్యే ఆళ్ల నాని అఖండ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. చంద్రబాబు హయాంలో బీసీలకు చేసిందేమి లేదని విమర్శించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్‌నగర అధ్యక్షుడు లక్కోజు రాజగోపాలాచారి, బీసీ మేదర కుల సంఘం నాయకులు ఉన్నారు.



మేదర కుల సంఘం నాయకులతో ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్

ఎన్నికల్లో సమర్థవంతంగా పనిచేయండి

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా నూజివీడు, ఏలూరు పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో పనిచేస్తోన్న పోలీస్ అధికారులు, సిబ్బందికి ఎస్పీ డి.మేరిప్రశాంతి ఆదేశాల మేరకు ఎన్నికల శిక్షణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. నూజివీడు సబ్ డివిజన్‌కు సంబంధించి హేలాపురి ఇంజినీరింగ్ కళాశాల, ఏలూరు సబ్ డివిజన్‌కు సంబంధించి ఏలూరు డీఎస్పీ ఈ.శ్రీనివాసులు ఆధ్వర్యంలో రామచంద్ర ఇంజినీరింగ్ కళాశాలలో శిక్షణ ఇచ్చారు. ఏలూరు సీసీఎస్ సీఐ సీహెచ్ మురళీకృష్ణ మాట్లాడుతూ రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో కోడ్ ఆఫ్ కండక్ట్ రూల్స్ విధిగా పాటించాలన్నారు. ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా పనిచేయాలని సూచించారు. వన్‌టౌన్ సీఐ ఎస్ రాజశేఖర్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో నేరాలకు పాల్పడిన చరిత్ర ఉన్న వ్యక్తులపై ప్రత్యేకంగా నిఘా ఉంచాలని సూచించారు. చెక్ పోస్టుల వద్ద నగదు, మద్యం, నాటుసారా, గంజాయి వంటి వాటి అక్రమ రవాణాను అరికట్టేందుకు నిత్యం వాహన తనిఖీలు చేయాలని అన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీసీఎస్ సీఐ మురళీకృష్ణ

క్రైస్తవుల ఉపవాస దీక్ష ప్రారంభం



ఉపవాస దీక్ష ప్రారంభిస్తున్న బిషప్ జయరావు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పరిమిత స్థాయిలో చేసే ఉపవాస దీక్ష మానసిక, శారీరక ఆరోగ్యాన్ని పెంచి దైవ సాన్నిధ్యానికి దగ్గర చేస్తుందని ఏలూరు పీఠాధిపతి బిషప్ పొలిమేర జయరావు అన్నారు. స్థానిక గ్రేవియర్ నగర్‌లోని అమలోద్భవి కథీడ్రల్ ఆలయంలో విచారణ కర్త ఫాదర్ ఇంజమాల మైఖేల్ ఆధ్వర్యంలో క్రైస్తవ ఉపవాస దీక్షల ప్రారంభ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని దివ్య బలిపూజ చేశారు. ఈ సందర్భంగా జయరావు మాట్లాడుతూ విశ్వాసులు తమ పాపాలు, దోషాల పట్ల పశ్చాత్తాప హృదయంతో ఉండి, దీక్షా కాలంలో ప్రత్యేకంగా మారుమనస్సు పొందాలని పిలుపునిచ్చారు. తపస్సు కాలంలో ఉన్న క్రైస్తవులు ఏసుక్రీస్తు శిలువ శ్రమలపై ధ్యానం చేసుకుంటూ క్రీస్తు ప్రభువులా దుష్టశక్తులపై విజయం సాధించి పవిత్రమైన జీవితం గడపాలని ఆకాంక్షించారు. సుమారు 100 మంది క్రైస్తవులు ఉపవాస దీక్ష స్వీకరించారు. కార్యక్రమంలో ప్రొక్యూరేటర్ ఫాదర్లు బి.రాజు, ఎస్ స్టీవెన్ థామస్, ఎస్ ఆదాం, ఎ.రాకేష్, ఎం అగస్టీన్, కార్పొరేటర్ నిర్మల గ్రేవియర్, జి.బె నర్జీ, ఎన్ కృపానందం, టి.రామారావు, వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలు

దెందులూరు: రామారావుగూడెంలో కాలి బ్రదర్స్ ఆధ్వర్యంలో కాలి నాని జ్ఞాపకార్థం వాలీబాల్ పోటీలు నిర్వహించారు. రామారావుగూడెం నుంచి రెండు టీమ్‌లు, శ్రీరామవరం ఒక టీమ్, చల్లచింతలపూడి ఒక టీమ్, మేధినరావుపాలెం ఒక టీమ్, ఖండ్రిక నర్సింహారావుపురం టీమ్‌లు పాల్గొన్నాయి. ఫైనల్ మ్యాచ్‌కు రామారావుగూడెం రెండు టీమ్‌లు వచ్చాయి. విజేతగా రామారావుగూడెం-1 టీమ్ నిలిచింది. విజేత టీమ్‌కు కానిస్టేబుల్ కాలి రమేష్, ఎంపీటీసీ కాలి ఇస్రాయేలు, ఉపాధ్యాయులు కాలి రామారావు బహుమతులు అందజేశారు. కానిస్టేబుల్ కాలి రమేష్ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాల వైపు వెళ్లకుండా విద్య, క్రీడల వైపు దృష్టి సారించాలన్నారు.

హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలి

ఏలూరు (టూటౌన్): డ్రైవర్లకు ఉరితాడు లాంటి హిట్ అండ్ రన్ చట్టాన్ని బేషరతుగా రద్దు చేయాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ ఏలూరు జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి జె.గోపి కోరారు. స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్రిటీష్ చట్టాలు రద్దు చేసి భారతీయ చట్టాలను తీసుకొస్తామని చెప్పి, డ్రైవర్లను తమ వృత్తి నుంచి గెంటేసే పద్ధతిలో ప్రధాని మోదీ ప్రభుత్వం చట్టాలను తీసుకొచ్చిందని విమర్శించారు. బ్రిటీష్ పాలకులు 1860లో తీసుకొచ్చిన ఐపీసీ 304 ఏ సెక్షన్ ప్రకారం ప్రమాదాల్లో మానవ తప్పిదాలకు రెండేళ్ల జైలు శిక్ష మాత్రమే ఉందని, మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన భారతీయ న్యాయన సంహిత 106 (1అండ్2) సెక్షన్ల ప్రకారం పదేళ్ల జైలు శిక్ష, రూ.10 లక్షల జరిమానా క్రూమైన చర్యగా పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 16న నిర్వహించే దేశవ్యాప్త గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెలో రవాణా కార్మికులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.సోమయ్య మాట్లాడారు.



మాట్లాడుతున్న ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు

సమ్మె విజయవంతం కోరుతూ ర్యాలీ

ఏలూరు (టూటౌన్): ఈ నెల 16న నిర్వహించే గ్రామీణ బంద్, కార్మిక సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ కార్మిక సంఘాలు, రైతు సంఘాల ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం ఏలూరులో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ, ఇఫ్టూ, ఏఐటీయూసీ, బీకేఎంయూ, ఏపీ రైతు సంఘం నాయకులు డీఎన్‌వీడీ ప్రసాద్, ముంగాపు అప్పారావు, రెడ్డి శ్రీనివాస డాంగే, బండి వెంకటేశ్వరరావు, కె.శ్రీనివాస్ మాట్లాడారు. వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఆర్ఆర్‌పేటలోని సంఘ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఏపీ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.శ్యామల, మన్నవ యామిని మాట్లాడుతూ గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. స్థానిక ఆర్ఆర్‌పేటలోని చేతివృత్తిదారుల సంఘ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు, కోకన్వీనర్ ఆగొల్ల వెంకట కృష్ణారావు మాట్లాడుతూ బంద్, సమ్మెను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



ఏలూరులో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

వైభవంగా శ్రీపంచమి పూజలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): శ్రీ పంచమి (వసంత పంచమి) పర్వదినం సందర్భంగా స్థానిక పాతబస్టాండు వద్ద ఉన్న శ్రీ పాండురంగ స్వామి దేవస్థానంలో బుధవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం సరస్వతీ దేవి అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించి విశేష అలంకరణ చేశారు. వివిధ పాఠశాలల విద్యార్థులు సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. సాయంత్రం ప్రదోషకాల అర్చన చేశారు. రాత్రి ఊంజల్ సేవ నిర్వహించి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వినియోగం చేశారు. అర్చకుడు దండిభొట్ల కనకసుందర శర్మ విశేష పూజలు చేయగా, ఆలయ కార్యనిర్వహణాధికారి సీహెచ్ చిననాగేశ్వరరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు. వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి గుత్తుల బాలాత్రిపుర సుందరి ఆధ్వర్యంలో కార్యదర్శి తిప్పాని మణి, సంయుక్త కార్యదర్శి కగ్గా రజని, కార్యదర్శి కూనపరెడ్డి. తులసివర్మ భక్తులకు, విద్యార్థులకు సౌకర్యాలు కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్‌లు, పుస్తకాలు, జ్యామెట్రీ బాక్సులు పంపిణీ చేశారు.



సరస్వతీ దేవికి పూజ చేస్తున్న భక్తులు

జగనన్న నాయకత్వంలో అన్ని వర్గాలకూ మేలు

పెదపాడు: జగనన్న నాయకత్వంలో అన్ని వర్గాల ప్రజలకూ మేలు చేకూరుతోందని పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు తెలిపారు. తాళ్లమూడి గ్రామంలో బుధవారం గ్రామ పంచాయతీ భవనం, ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్, పాలసేకరణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి అన్ని వర్గాలను కలుపుకుంటూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారని కొనియాడారు. మాజీ ఎమ్మెల్యే చింతమనేనికి నీతి నిజాయతీలు లేవని, ఎస్సీలను కించపరిచిన దుర్మార్గుడని దయ్యబట్టారు. చంద్రబాబు కూడా అధికారుల సమావేశాల్లో టీడీపీ వారికే పనులు చేయండని బహిరంగంగా ఆదేశాలిచ్చేవారని విమర్శించారు. ప్రతి ఒక్కరికీ ఇంటికే సంక్షేమ పథకాలు అందించిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. అప్పనవీడులో రూ.66.34 కోట్లు సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు ఖర్చు చేశామన్నారు. గత పాలకులు చేసిందేమీ లేదని విమర్శించారు. ప్రజలకు ఈ విషయాన్ని పార్టీ శ్రేణులు వివరించాలన్నారు. ఆరోగ్యశ్రీ కార్డు పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచారని వివరించారు. పిల్లల చదువు లకు బ్యాగులు పుస్తకాలు, టైలు షూలు, గోరుముద్ద పథకంలో నాణ్యమైన పోషకాలు కలిగిన ఆహారం అందిస్తున్నారని చెప్పారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ద్వారా ఎందరో పేద విద్యార్థులు ఉన్నత విద్యనభ్యసించి మంచి ఉద్యోగాల్లో స్థిరపడ్డారని అన్నారు. ప్రజల క్షేమం కోరే సీఎం జగన్‌కు అందరూ మద్దతుగా నిలిచి వచ్చే ఎన్నికలలో వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు ఘన విజయాలు అందించాలని కోరారు.

ఆలయ పునఃప్రతిష్ఠకు శ్రీకారం

దెందులూరు: జోగన్నపాలెంలో బాలత్రిపుర సుందరీదేవి సమేత యోగలింగేశ్వరస్వామి పంచాయతన ఆలయ పునఃప్రతిష్ఠ కార్యక్రమం ఈ నెల 28న ఉదయం 10.02 గంటలకు బ్రహ్మశ్రీ బాదంపూడి ఫణిశర్మ, కొత్తలంక రామ్ ప్రసాద్‌శర్మ, రుద్రపాటి చైతన్య సాయి, సాయిదత్త పర్యవేక్షణలో నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ నిర్వాహకులు మాజీ కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ ఆలూరి వీరనాగగోవిందరావు, సావిత్రిదేవి తెలిపారు. బుధవారం ఉదయం ఆలయ ఆవరణలో పునఃప్రతిష్ఠ పూజల్లో భాగంగా పందిరి రాట పాతారు. ఈ సందర్భంగా గోవిందరావు దంపతులు మాట్లాడుతూ గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, పాడి పంటలతో ఉండే విధంగా యాగశాలలో యాగం చేస్తామన్నారు. తొలుత ఆలయ దుర్గ చండేశ్వర, కాలభైరవ ద్వారపాలక, జంట నాగుల పునఃప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తామని వివరించారు.

రైతులపై దమనకాండ దుర్మార్గం

ఏలూరు (టూటౌన్): రైతులు శాంతియుతంగా నిర్వహిస్తోన్న చలో ఢిల్లీ కార్యక్రమంపై కేంద్రంలోని మోదీ ప్రభుత్వం దమనకాండకు పాల్పడటం దుర్మార్గమని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి డేగా ప్రభాకర్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన సీపీఐ జిల్లా కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. ఢిల్లీ, హర్యానా సరిహద్దుల్లో ఇనుప మేకులు, ముళ్ల తీగలు, కాంక్రీట్ బారికేడ్లు, పెద్ద ఎత్తున పోలీసు బలగాలు మోహరించి రైతులపై యుద్ధం ప్రకటించడాన్ని ఖండించారు. ఈ నెల 16న నిర్వహించే గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెకు సీపీఐ, రైతు సంఘం సంపూర్ణ సహకారం అందిస్తుందని తెలిపారు

- ఏలూరు (టూటౌన్): శాంతియుతంగా ఢిల్లీ బయలు దేరిన రైతులపై అడ్డుకోవడానికి కేంద్ర ప్రభుత్వం విరుచుకుపడటంతో పాటు, డ్రోన్‌ల సాయంతో బాష్పవాయువు తూటాలు వెదజల్లడం దారుణమని ఏపీ రైతు కూలీ సంఘం కోకన్వీనర్ ఎస్ ఝాన్సీ, జిల్లా కార్యదర్శి షేక్ బాషాలు ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. దేశంలో ప్రజాస్వామ్యం ఏవిధంగా అమలు అవుతుంతో ఈ ఉదంతాలు అద్దం పడుతున్నాయని తెలిపారు. ఈ నెల 16న జరిగే అఖిల భారత గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఏలూరు డివిజన్ పరిధిలో ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ విద్యుత్ ఉద్యోగుల యూనియన్ 1104 ఆధ్వర్యంలో బుధవారం స్థానిక విద్యుత్ భవన్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూనియన్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.కృష్ణ కుమార్, ఎస్ నరసింహారావు మాట్లాడుతూ ఏలూరు డివిజన్ పరిధిలో ఇటీవల నిబంధనలకు విరుద్ధంగా ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ విభాగం లైన్ ఇన్‌స్పెక్టర్ జి.వెంకటేశ్వర్లు, ఎస్ఎల్ఐ కె.శ్రీనివాస్‌లను అక్రమంగా సస్పెండ్ చేయడం దారుణమన్నారు. విద్యుత్ ప్రమాదాలకు యూనియన్ సభ్యులను మాత్రమే బాధ్యులను చేయడం మానుకోవాలన్నారు. ఎం రమేష్, ఎం గాంధీ, ఎం మురళీ మోహన్, డి.నాగరాజు, జి.శ్రీకాంత్ పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	26	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	32	చిక్కుడు కాయలు	44
వంకాయలు (కాంతులు)	38	చామదుంపలు	60
వంకాయలు (తెలుపు)	38	ములక్కాడలు	08-10
బెండకాయలు	44	కంద	60
పచ్చిమిర్చి	34	బీట్‌రూట్	40
కాకర కాయలు	54	కీరా దోస	30
బీరకాయలు	36	ఫ్రెంచ్‌బీన్స్	60
బీరకాయలు (పందిరి)	40	అల్లం	120
క్యాబేజీ	22	కొత్తిమీర (కట్ట)	15
క్యారెట్	34-44	పాలకూర	10
దొండకాయలు	38	చుక్కకూర	10
బంగాళదుంపలు	26	తోటకూర	10
ఉల్లిపాయలు	20-25	గోంగూర	08
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	30-40	బఠాణి	--
ఆనబకాయ (1)	20	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	20-30	చిలకడదుంప	34

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	24
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	31
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.30	45
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	16.00	37
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	36

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	20
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	23
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	16
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	26
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	23
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	19
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	33